కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :152 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శనివారం 03-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## కాంగ్రెస్,బీఆర్ఎస్ మధ్య క్విడ్ ప్రో కో : రామచందర్ రావు



హైదరాబాద్,తెలంగాణలో అధికార కాంగ్రెస్, గతంలో పాలించిన బీఆర్ఎస్ మధ్య పరస్పర అవినీతి బాగోతాలను కప్పిపుచ్చుకునే 'క్విడ్ ప్రో కో' నడుస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. మొన్న సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ మంత్రులు, కుటుంబీకుల ఆస్తులపై ఆరోపణలు చేస్తే దానికి ప్రతిగా బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ అవినీతిపై ఆరోపణలు చేసుకుంటున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. ఇవాళ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..."నువ్వు ఎంత తిన్నావు, నేను ఎంత తిన్నాను... మీరే అంతా తినేస్తే మాకేం మిగిల్చలేదు" అన్న చందంగా ఇరు పార్టీలు పరస్పర ఆరోపణలకే పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి అవినీతి రహిత సుపరిపాలన అందిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎవరు ఎక్కువ అవినీతి చేయాలనే పోటీ పడుతున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో బీఆర్ఎస్ అవినీతి చిట్టా విప్పి అరెస్టులు చేస్తామని ప్రగల్భాలు పలికి నేటికీ ఒక్క కేసులోనూ అరెస్టు చేయలేదని గుర్తు చేశారు. కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమై లోపాయికారీ ఒప్పందాలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు.

టీచర్ల డిమాండ్లు నెరవేర్చాలి:

రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రశ్నించే వారిపై అక్రమ అరెస్టులతో ఉక్కుపాదం మోపుతోందని రాంచందర్ రావు మండిపడ్డారు. గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద జీవో 317ను బీజేపీతో పాటు ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించారని, దానికి ప్రత్యామ్నాయంగా ఈ ప్రభుత్వం తెచ్చిన జీవో 190ను సైతం సరిగ్గా అమలు చేయడం లేదని విమర్శించారు. జీవో 190 పరిధిలో దాదాపు 4000 మందికి ట్రాన్స్‌ఫర్లు/డిప్యుటేషన్లు రావాల్సి ఉండగా, కేవలం 100 నుంచి 200 మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. దీనిపై గాంధీ భవన్ ఎదుట న్యాయబద్ధంగా ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులను పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడాన్ని బీజేపీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీచర్ల న్యాయమైన కోరికలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పొలాలు ఎండుతుంటే చోద్యం చుస్తున్నారు:

రాష్ట్రంలో అన్నదాతల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, నీళ్ల లేక, కరెంట్ రాక పొలాలు ఎండిపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాలో బోరుబావుల్లో నీరులేక పంటలు ఎండిపోయి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని, జూరాలకు వెళ్తుంటే రైతులను, తమ పార్టీ నేతలను సైతం అరెస్టు చేశారని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని, రాబోయే రబీ పంటకు సిద్ధమవుతున్న అన్నదాతలను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే ఒక విడత 'రైతు భరోసా' నిధులను విడుదల చేసి వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'కు రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని దుయ్యబట్టారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కేంద్ర పథకం కంటే మెరుగైన బీమా తెస్తామని చెప్పి, నేటికీ ఎలాంటి బీమా పథకాన్ని అమలు చేయకుండా రైతుల నోట్లో మట్టికొట్టారని ఫైర్ అయ్యారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి రబీకి ముందే రైతు భరోసా అందించాలని స్పష్టం చేశారు.

బీజేపీలోకి చేరికలు:

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుతో విసిగిపోయిన ప్రజలు రాష్ట్రంలో బీజేపీని ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని, రాబోయే రోజుల్లో బీజేపీకే అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నారని రాంచందర్ రావు పేర్కొన్నారు. మేధావులు, రాజకీయ చైతన్యం ఉన్న యువత పెద్దఎత్తున భారతీయ జనతా పార్టీలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశం సందర్భంగా సినిమా, టీవీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు బీజేపీలో చేరారు. బీజేపీ స్టేట్ సినిమా సెల్ కో-కన్వీనర్, నటుడు వైభవ్ సూర్య ఆధ్వర్యంలో టీవీ ఆర్టిస్ట్, న్యాయవాది స్వర్ణలత, ప్రముఖ టీవీ నటుడు లక్ష్మణ్, సీనియర్ కెమెరామెన్లు సురేష్, మహేష్ బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

## జంతర్ మంతర్ వద్ద హై టెన్షన్.. 500 మంది నిరసనకారుల అరెస్ట్



న్యూఢిల్లీ, కేంద్ర ఎన్నికల కమిషన్ తీరుకు నిరసనగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇవాళ్టి నుంచి సీజేపీ ఇచ్చిన పిలుపు తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఇవాళ జంతర్ మంతర్ వద్ద ప్రతిపక్ష నేతలు చేపట్టిన ఆదోళన టెన్షన్ గా మారిందిద. అనుమతి లేదంటూ జంతర్ మంతర్ వద్ద వచ్చిన ఆయా పార్టీల నేతలను అడ్డుకోవడంతో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. ఓ వైపు ఆంక్షలు విధించినప్పటికీ, విద్యార్థి సంఘాలు, వివిధ రాజకీయ పక్షాలు జంతర్ మంతర్ వైపు దూసుకెళ్లేందుకు యత్నించాయి. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ సహా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. ఇవాళ ఉదయం నుంచి జంతర్ మంతర్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన సీపీఐ(ఎం) నాయకురాలు బృందా కరత్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, సామాజికవేత్త యోగేంద్ర యాదవ్, ఐఏఎస్ఏ నేత నేహా బోరా, ఆప్ నేతలు సౌరభ్ భరద్వాజ్, సంజీవ్ ఝా, అనురాగ్ ధండా, ఆతిశీ మరియు సంజయ్ సింగ్ సహా 500 మందికి పైగా నిరసనకారులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ముంబయిలో ఆందోళనలు:

మరోవైపు సీఈసీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ నేడు ముంబయిలో నిరసనలు చేపట్టింది. శివాజీ పార్క్ లో చేపట్టిన ఆందోళనకు కూడా పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ క్రమంలో సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

ఢిల్లీ, ముంబయిలో హై అలర్ట్:

విపక్షాల ఆందోళనల నేపథ్యంలో ఢిల్లీ, ముంబయి నగరాల్లో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. భద్రతా కారణాల రీత్యా ఢిల్లీలోని రాజీవ్ చౌక్, పటేల్ చౌక్, జన్ పథ్, మండి హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్ సహా 12 కీలక మెట్రో స్టేషన్లలో ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో దాదాపు 1.5 కిలోమీటర్ల మేర ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలని టెలికామ్ కంపెనీలను ఆదేశించారు. అంతేకాకుండా నగరవ్యాప్తంగా 163 సెక్షన్ విధించారు.

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు



హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ముఖ్యమంత్రి నాయకత్వంలో సమావేశమై ప్రభుత్వ ఉద్యోగులు, రైతాంగం, విద్యుత్ రంగం మరియు మౌలిక సదుపాయాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ప్రధానంగా 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న 2 డీఏల విడుదలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ రెండు డీఏల అమలు వల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడనుంది. దీనితో పాటు రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించిన మంత్రివర్గం, రాష్ట్రంలో సగటున 17 శాతం వర్షపాతం లోటు నమోదు కావడంతో పాటు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినట్లు గుర్తించింది. తీవ్ర వర్షాభావం ఎదుర్కొంటున్న ప్రాంతాలకు కరువు సాయం అందించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని, అలాగే ఈ అంశంపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా ఈసారి దాదాపు 65 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. రాబోయే రోజుల్లో రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు వీలుగా 7,800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కొత్త విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వీటితో పాటు ఆసియాలోనే అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్‌గా భావిస్తున్న కోహెడ ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధి పనులు, డిజిటల్ మీడియా విధానాలు మరియు మౌలిక వసతుల కల్పనకు సంబంధించి 10 ఈపీసీ ప్రాజెక్టుల పురోగతికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ నిర్ణయాలు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి ఎంతో దోహదపడతాయని ప్రభుత్వం తెలిపింది.

## విద్యుత్ కొరత లేకుండా చూస్తున్నాం



నల్గొండ : రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం నల్గొండ పట్టణంలో గాంధీ జయంతి కార్యక్రమాలు ముగించుకుని నల్గొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలో లాగ్‌బుక్‌లు పరిశీలించిన విషయం వాస్తవమేనని మంత్రి తెలిపారు. అప్పట్లో కొందరు ఆపరేటర్లు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరువు పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు. తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. అయినప్పటికీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19 వేల మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సింగరేణి బొగ్గు లింకేజీ సమస్యలు, నైనీ బ్లాక్‌కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి బొగ్గు సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి ప్రత్యేకంగా 5 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కరువు పరిస్థితులను చూసి ప్రతిపక్షాలు సంతోషిస్తున్నాయని విమర్శించిన ఆయన.. తమ ప్రభుత్వం రైతులు, ప్రజలను ఆదుకునేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయాలనే ఆలోచనతోనే ముందుకు: భట్టి



హైదరాబాద్: నగరానికి కావాల్సిన మెట్రోరైలు ప్రాజెక్టు కూడా ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు తెలియాలని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ సలహాతో ప్రజాభవన్ లో మెట్రో-ఆర్టిసి కామన్ పాస్ ప్రారంభించామని, కామన్ పాస్ ను భట్టి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మన జాతిపిత మహాత్మ గాంధీజీ ఆలోచనలను అనుసరిస్తూ..సమాజ నిర్మాణానికి అంకితమవుదామని పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే రోడ్లు మొత్తం ఖాళీ అయిపోతాయని అన్నారని,ముఖ్యంగా ఈ నగరానికి కావాల్సింది తాగునీరు అని భట్టి పేర్కొన్నారు.రాష్ట్రానికి కావాల్సిన తాగునీరు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని కొనియాడారు.

పథకాలుచూడండి

రాష్ట్రానికి గత పదేళ్లు చుక్క నీరు అయినా బిఆర్ఎస్ తీసుకువచ్చిందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయాలనే ఆలోచనతోనే ముందుకు పోతుందని, గత ప్రభుత్వం ప్రచారాలు చేసుకుందే తప్పా..పనిచేయాలన్న ఆలోచన లేదని భట్టి విక్రమార్క విమర్శించారు. హెచ్ సియు, ట్రిపుల్ ఐటీ కూడా కాంగ్రెస్ తెచ్చిందేనని, బిహెచ్ఇఎల్, ఇసిఐఎల్,డిఆర్ డిఒ ఇలాంటి ప్రభుత్వరంగ సంస్థలు అన్ని కాంగ్రెస్ తెచ్చినవేనని అన్నారు. హైదరాబాద్: చుట్టూ రింగురోడ్డు వేసింది కూడా కాంగ్రెస్సేనని, పనిచేయడమే తప్ప, ప్రచారం చేయలేదని అన్నారు. గత ప్రభుత్వాలు ప్రచారం పైనే బతికాయని, జిహెచ్ఎమ్ సి రూ.10.వేల కోట్ల బడ్జెట్ పెట్టిన ఘనత కాంగ్రెస్ ది అని ఇప్పటికే రూ.5వేల కోట్ల పనులు నడుస్తున్నాయని, రూ.52 వేల కోట్లతో సిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, హైదరాబాద్ లో పొల్యూషన్ కంట్రోల్ పై దృష్టి పెట్టామని, ఇవి వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, డిజిల్ ఆటోలను నిషేధించామని, హిల్డ్ పాలసీని సైతం తీసుకొచ్చామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## గాంధీ బాటలో వికసిత భారత్...



న్యూఢిల్లీ,జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు ఎప్పటికీ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సత్యం, అహింస, నిరాడంబరత, స్వదేశీ భావనలతో కూడిన బాపూజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన బాటలో నడుస్తూ మెరుగైన సమాజంతో పాటు వికసిత భారత్ నిర్మాణం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మహాత్ముడికి నివాళులర్పించిన మోదీ.. ఆయన సందేశాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని.. బాపూజీ శాశ్వత సందేశం మెరుగైన సమాజం, వికసిత భారత్ నిర్మాణానికి నిరంతరం దిశానిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. గాంధీజీ జీవితం సత్యం, అహింస, కరుణ, సేవలకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి కాలంలోనూ మానవాళికి ఆయన జీవితం మార్గం చూపుతుందని అన్నారు. వీడియో సందేశంలోనూ గాంధీజీ గొప్పతనాన్ని మోదీ వివరించారు. అక్టోబరు 2 ప్రాధాన్యం దేశంలోని ప్రతి చిన్నారికీ తెలుసని అన్నారు. అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ కోట్లాది మంది ప్రజల హృదయాల్లో గాంధీజీ ఇప్పటికీ నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన సిద్ధాంతాల ప్రభావం మానవాళిపై ఉన్నంతకాలం ఆ ఆశయాలు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని తెలిపారు. గాంధీజీ స్వదేశీ భావనకు ఎంతో ప్రాధాన్యమిచ్చారని, ఖాదీ దానికి ప్రధాన చిహ్నమని ప్రధాని గుర్తుచేశారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. స్వదేశీ వస్తువులను గర్వంగా వినియోగించాలని పిలుపునిచ్చారు. లాల్ బహదూర్ శాస్త్రికీ నివాళులు..: దేశ రెండో ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన్ను కూడా ప్రధాని మోదీ స్మరించుకున్నారు. ఆయన నిరాడంబరత, దేశం పట్ల అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని విజయ్‌ఘాట్ వద్ద శాస్త్రి సమాధికి నివాళులర్పించారు. 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో సైనికులు, రైతుల్లో కొత్త స్ఫూర్తి నింపిన గొప్ప నాయకుడని కొనియాడారు. బయటకు ఎంతో నిరాడంబరంగా కనిపించినా.. సంకల్పంలో మాత్రం లాల్ బహదూర్ శాస్త్రి రాతిలా దృఢంగా ఉండేవారని మోదీ గుర్తుచేశారు. రైతులు, సైనికుల సహకారంతో దేశం విజయాలు సాధించేందుకు శాస్త్రి చూపిన మార్గం చిరస్మరణీయమని అన్నారు.



## సంపాదకీయం

శనివారం 03-10-2026

# వర్సిటీల వికాసం సంస్కరణలతోనే సాధ్యం

రాష్ట్రంలోని వర్సిటీలను అధ్యాపకుల కొరత, నిధుల లేమి, ప్రమాణాలు కొరవడటం, పరిశోధన, బోధనలపై అశ్రద్ధ వంటి సమస్యలు వేధిస్తున్నాయి. ఎన్ఐఆర్ఎఫ్-2025 జాతీయ ర్యాంకింగ్‌ల్లో ఆంధ్ర, నాగార్జున విశ్వవిద్యాలయాలు తప్ప వేరేవాటికి చోటు దక్కలేదు. న్యాక్ 'ఎ' గ్రేడ్ పైన సాధించిన వర్సిటీలు కూడా తక్కువే. కాలమాన పరిస్థితులకు తగినట్లుగా విశ్వవిద్యాలయాలు విద్యావెలుగులు విరజిమ్మాలంటే గుణాత్మక మార్పులు అవసరం.జాతీయ విద్యావిధానంలో సూచించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని వర్సిటీలను బోధన, పరిశోధనా విశ్వవిద్యాలయాలుగా విభజించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. దీనివల్ల ఒకశ్రేణికి చెందిన వర్సిటీలు తమ వనరులను, సౌకర్యాలను, శక్తియుక్తులను బోధనపై కేంద్రీకరిస్తాయి. వివిధ కోర్సుల్లో వస్తున్న మార్పులు, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, పాఠ్యప్రణాళికలను సవరించుకుంటూ, విద్యార్థులకు అవసరమైన కోర్సులను అందిస్తాయి. ఉన్నత విద్యలో ప్రవేశాల కల్పన, స్థూల ప్రవేశాల నిష్పత్తి(జీఈఆర్)ని వృద్ధి చేయడం వంటి బాధ్యతలను చేపడతాయి. ఇంకో శ్రేణికి చెందిన వర్సిటీలు పరిశోధనలపై దృష్టి పెడతాయి. నాణ్యమైన పరిశోధనలను చేపట్టడం, ప్రచురించడం, అంతర్జాతీయ గుర్తింపు సాధించే పనిలో నిమగ్నమవుతాయి. ఇలాంటి వర్సిటీలకు ప్రభుత్వం విధాన పత్రాల రూపకల్పన, పథకాల పనితీరు సమీక్ష, మదింపు, నివేదికల తయారీ వంటి బాధ్యతలు అప్పగించవచ్చు. ప్రస్తుత కాలంలో ప్రతి అంశాన్నీ లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంటోంది. పరిశోధన వర్సిటీలను 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'గా పరిగణించి, ఆయా సేవలు పొందవచ్చు. స్టార్టప్‌లను ప్రోత్సహించే సంస్థలుగా తీర్చిదిద్ది యువతకు తోడ్పాటు అందించవచ్చు. ఇందుకోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో పేరొందిన నిపుణులు, పరిశోధకులను నియమించాలి. ప్రామాణిక సంస్థలు, ప్రయోగశాలలు, సంస్థలతో ఎంవోయూలు కుదర్చాలి.

గుణాత్మక మార్పుల సాధనకు...

బోధన, పరిశోధనా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు విశ్వవిద్యాలయాల బోధన వ్యవస్థా స్వరూపాన్ని పునర్నిర్మించడం మేలు. ఆదరణ అంతగా లేని కోర్సులను రద్దు చేయవచ్చు. అన్ని వర్సిటీల్లో నైపుణ్య శిక్షణా కేంద్రాలను ప్రారంభించాలి. అత్యాధునిక, సాంకేతిక సౌకర్యాలతో వర్క్‌షాపులు, ల్యాబొరేటరీలు ఉండాలి. నిపుణులైన శిక్షకులను నియమించడం తప్పనిసరి. శిక్షణాంశాలను మారుస్తుండాలి. ఏ ప్రాంత విద్యార్థికైనా ప్రవేశార్హతను కల్పించాలి. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థతో ఎంవోయూ కుదుర్చుకోవడం మంచిది. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఏ సంస్థ అందించే నైపుణ్య కోర్సయినా, 'నేషనల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్' నియమావళికి లోబడి ఉంటేనే గుర్తింపు లభిస్తుంది. ప్రస్తుత కాలంలో విద్యాసంస్థలు సాధించే ఉద్యోగాల ఆధారంగానే వాటిలో ప్రవేశాలకు డిమాండ్ ఉంటోంది. అందుకని వర్సిటీలు ఉద్యోగ కల్పనపైనా ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ విషయంలో బోధనా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి నైపుణ్య శిక్షణ, ఉద్యోగ కల్పనకు కృషిచేయాలి. విద్యార్థులకు 'ఇంటర్న్‌షిప్' అవకాశాలు కల్పించడంపైనా అధ్యాపకులు శ్రద్ధ వహించాలి. ఇందుకోసం ఏఐసీటీఈ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక అవకాశాలను అందిపుచ్చుకోవాలి.పూర్వ విద్యార్థులను విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో భాగస్వాములను చేయాలి. ఇందుకోసం పూర్వ విద్యార్థుల సంఘాలను క్రియాశీలకంగా మార్చడం అవసరం. చదువు చెప్పిన సంస్థపై ఎవరికైనా ప్రేమాభిమానాలు ఉంటాయి. వారందరినీ ఒక్కచోటకు చేర్చి నిరంతర కార్యకలాపాల ద్వారా విద్యాసంస్థ పురోగతికి తోడ్పడేలా కార్యాచరణ రూపొందించాలి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద పారిశ్రామిక సంస్థలు వర్సిటీలకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందించేలా ప్రోత్సహించవచ్చు. ఈ పథకం కింద ఏదైనా సంస్థ విశ్వవిద్యాలయాన్ని దత్తత తీసుకుని మెరుగుదిద్దేలా చేయవచ్చు. రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న దేశీయ పారిశ్రామిక సంస్థలు, ఇతర ఎంఎన్‌సీల తోడ్పాటును తీసుకోవచ్చు. దీనివల్ల ఆర్థిక, సాంకేతిక వనరులు సమకూరడమే కాకుండా కార్పొరేట్ తరహా నిర్వహణ అందుబాటులోకి వచ్చి వర్సిటీ వేగంగా ముందడుగు వేసే అవకాశం ఉంటుంది. విద్యార్థులకూ అధునాతన నైపుణ్యాలు అబ్బడంతో ఉద్యోగ మార్కెట్‌లో దూసుకెళ్లవచ్చు. పరిశోధనల రంగంలోనూ ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి, అమలు చేస్తున్న 'పి-4' పథకాన్ని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి కూడా వర్తింపజేయవచ్చు. ఇలాంటి చర్యలతోనే వర్సిటీలు గుణాత్మక మార్పులను సాధించగలవు.

సరికొత్త కార్యాచరణతో...

విశ్వవిద్యాలయాల నిర్వహణకు ఐఐటీ తరహా పాలక మండలిని ఏర్పాటు చేయడం మేలు. ఒక ట్రస్టులా వ్యవహరించే ఈ మండలికి ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పించవచ్చు. దీనివల్ల ప్రభుత్వ యంత్రాంగం పరంగా జోక్యాన్ని కూడా తగ్గించవచ్చు. కొన్ని ఐఐటీల పాలక మండళ్లలో ప్రభుత్వం తరఫున ఒక్కరే ప్రతినిధి ఉంటారు. అయినా, అవేవీ నిధుల కొరతను ఎదుర్కోవడం లేదు. కాకపోతే, ఐఐటీలకిచ్చే నిధులతో పోలిస్తే, రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి మంజూరయ్యే గ్రాంటు చాలా తక్కువే. ఆధునిక పోటీ ప్రపంచంలో విశ్వవిద్యాలయాలను మూసధోరణిలో నడపడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. అందుకే, పరిస్థితుల్ని గమనిస్తూ, రాష్ట్ర విశ్వవిద్యాలయాల పునర్నిర్మాణం కోసం కొత్త ఆలోచనలతో సరికొత్త కార్యాచరణతో ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం విద్యారంగ నిపుణులతో ప్రత్యేక కమిటీని నియమించి మెరుగైన సిఫార్సులు, సూచనలు కోరవచ్చు. ఈ విషయంలో విశ్వవిద్యాలయాలు సైతం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వాస్తవానికి, ప్రతి విశ్వవిద్యాలయం రాబోయే పదిహేనేళ్ల కాలావధితో 'ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్'ను రూపొందించుకోవాలంటూ యూజీసీ కొన్ని మార్గదర్శకాలు సైతం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అన్ని వర్సిటీలు సమగ్ర సంస్కరణల పథంలో సంస్థాగత అభివృద్ధి దిశగా ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయడానికి ఇదే సరైన తరుణం. తద్వారా మన వర్సిటీలు, విద్యార్థులు రాబోయే కాలానికి తగినట్లుగా అన్ని సవాళ్లను తట్టుకుని నిలబడేందుకు అవకాశం ఉంటుంది.

# అది రేపిస్టుల అడ్డా..కార్నెల్ '7' కలకలం

న్యూయార్క్, అమెరికా క్యాంపస్‌లలో లైంగిక దాడుల ఆరోపణలపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. కార్నెల్ యూనివర్సిటీకి చెందిన ఓ ఫ్రాటర్నిటీకి చెందిన ఏడుగురిపై 2024లో ఓ 20 ఏళ్ల విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ తాజాగా దాఖలైన వ్యాజ్యం సంచలనం రేపింది. 'కార్నెల్ 7' పేరుతో ఈ వ్యవహారం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో.. బాధితుల వాదనలు, నిందితుల హక్కులు, సమ్మతి అంశం, క్యాంపస్‌ల భద్రత, యూనివర్సిటీల బాధ్యతపై అమెరికా వ్యాప్తంగా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కోర్టులో నమోదైన ఆరోపణలు ఇంకా తుది నిర్ధారణకు రాలేదు. ఇదే సమయంలో 2024లో కేసు నమోదు కాకపోవడానికి సంబంధించిన అంశాలను కూడా అధికారులు మరోసారి పరిశీలిస్తున్నారు.సెప్టెంబర్ మధ్యలో ఓ బుధవారం రాత్రి 7.05 గంటలకు న్యూయార్క్ కౌంటీ సుప్రీంకోర్టు డాకెట్‌లోకి ఓ కేసు పిటిషన్ చేరింది. 101 పేజీల ఆ వ్యాజ్యం వెలుగులోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే అమెరికా వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఆగ్రహం.. ఆవేదన.. అనుమానాలు.. పరస్పర ఆరోపణలు.. ఇలా ఎన్నో ప్రశ్నలను లేవనెత్తింది. ముఖ్యంగా అమెరికా కాలేజీ క్యాంపస్‌లలో లైంగిక దాడుల ఆరోపణలను ఎలా చూడాలి? వాటిపై విచారణ ఎలా సాగాలి? బాధితుల వాదనలకు, నిందితుల హక్కులకు మధ్య సమతుల్యత ఎలా ఉండాలి? అన్న చర్చ మరోసారి తెరపైకి వచ్చింది.

డ్రగ్స్ మత్తులో.. గంటల తరబడి?

కార్నెల్ యూనివర్సిటీకి చెందిన ఓ ఫ్రాటర్నిటీకి చెందిన ఏడుగురు సభ్యులు.. 2024లో ఓ 20 ఏళ్ల విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డారని తాజాగా దాఖలైన వ్యాజ్యంలో ఆరోపించారు. సదరు యువతి ఓ సోరోరిటీ సభ్యురాలు. డ్రగ్స్ వినియోగం నేపథ్యంలో గంటల తరబడి ఈ ఘటన జరిగినట్టు పిటిషన్‌లో పేర్కొన్నారు.ఈ కేసులో భాగంగా సమర్పించిన ఆధారాల్లో ఓ స్నాప్‌చాట్ సందేశం కూడా ఉంది. అందులో ఓ వ్యక్తి మహిళలను అవమానకరంగా ప్రస్తావిస్తూ సందేశం పంపగా.. మరికొందరు ఉత్సాహంగా స్పందించినట్టు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సందేశాలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టాయి.

'కార్నెల్ 7' పేరుతో వైరల్

సెప్టెంబర్ 16న వ్యాజ్యం దాఖలైన వెంటనే సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున స్పందనలు వచ్చాయి. నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు డిమాండ్ చేశారు. జిల్లా అటార్నీ కార్యాలయానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నిందితుల ఫొటోలు, ఇతర వ్యక్తిగత వివరాలు కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంచుకున్నారు. కొందరు వారిని 'కార్నెల్ 7'గా పేర్కొంటున్నారు.మరో వర్గం మాత్రం కోర్టులో నమోదైన ఆరోపణల ఆధారంగా వెంటనే ఒక నిర్ణయానికి రావడం సరికాదని హెచ్చరించింది. ముఖ్యంగా 2024లో బాధితురాలు అప్పట్లో ఇచ్చిన వాంగ్మూలానికి, తాజా వ్యాజ్యంలో పేర్కొన్న అంశాలకు తేడాలు ఉన్నాయని ప్రాసిక్యూటర్ చెప్పిన విషయాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. మరోవైపు.. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి గుర్తింపును బహిర్గతం చేయాలంటూ కూడా కొందరు ప్రయత్నించారు.ఈ వ్యవహారంలో రాజకీయ వ్యాఖ్యలు, బాధితురాలినే ప్రశ్నించే ధోరణి, నిందితులపై ముందస్తు తీర్పులు.. అన్నీ కలగలిసి పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చాయి. అదే సమయంలో.. ఈ కేసులో ఇంకా అనేక ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

మళ్లీ తెరపైకి క్యాంపస్ లైంగిక దాడుల అంశం

అమెరికాలో కాలేజీ క్యాంపస్‌లలో లైంగిక దాడుల ఆరోపణలు కొత్తేమీ కాదు.ప్రతి సంచలన కేసు దేశవ్యాప్తంగా మరోసారి చర్చకు తెరతీస్తూనే ఉంది.కొలంబియా యూనివర్సిటీ విద్యార్థిని ఎమ్మా సుల్కోవిచ్.. తనపై జరిగిన లైంగిక దాడి ఫిర్యాదును యూనివర్సిటీ నిర్వహించిన తీరును నిరసిస్తూ క్యాంపస్‌లో పరుపును మోసుకెళ్లిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది.స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మాజీ స్విమ్మర్‌పై జరిగిన కేసులో బాధితురాలు చానెల్ మిల్లర్ కోర్టులో చేసిన ప్రభావవంతమైన ప్రకటన కూడా అమెరికా వ్యాప్తంగా చర్చకు దారితీసింది. టెక్సాస్‌లో సమ్మర్ విల్లిస్ తనపై జరిగిన దాడికి సంబంధించిన చట్టపరమైన లోపాన్ని సరిచేయాలని కోరుతూ రాష్ట్ర క్యాపిటల్ వరకు చేతులు, మోకాళ్లపై పాకుతూ వెళ్లిన ఘటన కూడా ఇదే అంశంపై ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు కార్నెల్ వ్యవహారం మరోసారి ఆ చర్చకు కేంద్రంగా మారింది.



ప్రముఖుల స్పందనతో మరింత వేడి

నటి ఫ్లోరెన్స్ పగ్, మారిస్కా హార్గిటే వంటి ప్రముఖులు సోషల్ మీడియాలో స్పందించడంతో కార్నెల్ కేసుపై చర్చ మరింత విస్తరించింది.

'ప్రెట్టీ లిటిల్ లయర్స్' సిరీస్‌తో గుర్తింపు పొందిన నటి సాషా పీటర్స్ కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. తాను కూడా లైంగిక దాడికి గురైన బాధితురాలినేనని ఆమె తొలిసారిగా బహిరంగంగా వెల్లడించారు. దాడి జరిగిన తర్వాత ఎదురయ్యే భయం, అవమానం, మానసిక-శారీరకంగా కోలుకోవడానికి పట్టే సమయం వంటి అంశాల తీవ్రతను చాలామంది పూర్తిగా అర్థం చేసుకోరని ఆమె అన్నారు. కార్నెల్ వ్యవహారంపై వస్తున్న చర్చ ఇతర బాధితులకు తాము ఒంటరివాళ్లం కాదనే భావన కలిగిస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. అలాగే సమ్మతి (కన్సెంట్)కు సంబంధించిన చట్టాలను మరింత స్పష్టంగా, దేశవ్యాప్తంగా ఒకే విధంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

20 ఏళ్ల కిందటి ఘటన

క్యాంపస్ లైంగిక దాడుల కేసుల్లో బాధితుల హక్కుల కోసం పనిచేస్తున్న న్యాయవాది లారా ఎల్. డన్‌కు కార్నెల్ కేసు గురించి పిటిషన్ దాఖలైన వెంటనే సమాచారం అందింది. ఆమెకు ఈ వ్యవహారం వ్యక్తిగతంగానూ బాధాకరమే. 2004లో విస్కాన్సిన్-మాడిసన్ యూనివర్సిటీలో విద్యార్థి అథ్లెట్‌గా ఉన్న సమయంలో తనపై ఇద్దరు సహచరులు లైంగిక దాడికి పాల్పడ్డారని డన్ ఫిర్యాదు చేశారు. అయితే ఆ కేసులో ఎలాంటి అభియోగాలు నమోదు కాలేదు.దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కూడా ఇలాంటి ఘటనపై వార్త చదవాల్సి రావడం బాధాకరంగా ఉందని ఆమె అన్నారు.

నిందితుల తరఫు అడ్వొకేట్ల వాదన

కార్నెల్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురిలో ఇద్దరి తరఫు న్యాయవాదులు ఆరోపణలను ఖండించారు. అంతేకాదు.. 2024లో జరిగిన ఘటన న్యూయార్క్ చట్టాల ప్రకారం నేరంగా పరిగణించాలా అన్న దానిపైనా చర్చ మొదలైంది. అప్పట్లో క్రిమినల్ కేసు నమోదు చేయకపోవడాన్ని సమర్థించిన టాంప్‌కిన్స్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ మాథ్యూ వాన్ హౌటెన్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. 2024లో బాధితురాలు డ్రగ్స్ వినియోగం, లైంగిక చర్యల్లో తన పాల్గొనడం స్వచ్ఛందంగానే, స్పృహతోనే, సమ్మతితోనే జరిగిందని వివరించినట్టు ఆయన చెప్పారు. ఇప్పుడు కేసును తిరిగి తెరవనున్నట్టు వాన్ హౌటెన్ ప్రకటించారు. లైంగిక దాడికి గురైన బాధితులు ఆ ఘటనను పూర్తిగా అర్థం చేసుకోవడానికి, మానసికంగా కోలుకోవడానికి కొన్నిసార్లు సంవత్సరాల తరబడి చికిత్స, సహాయం అవసరమవుతుందని తాను గుర్తిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

'తప్పుడు కేసులతో పోలికలు

మరోవైపు సోషల్ మీడియాలో కొందరు ఈ కేసును గతంలో సంచలనం సృష్టించి చివరకు నిరాధారమైనవిగా తేలిన ఆరోపణలతో పోలుస్తున్నారు. డ్యూక్ యూనివర్సిటీ లాక్రాస్ ఆటగాళ్లపై వచ్చిన ఆరోపణలు, వర్జీనియా యూనివర్సిటీలోని ఓ ఫ్రాటర్నిటీకి సంబంధించిన ఘటనపై 'రోలింగ్ స్టోన్' ప్రచురించి తర్వాత ఉపసంహరించుకున్న కథనం వంటి ఉదాహరణలను వారు ప్రస్తావిస్తున్నారు. ప్రతి కేసు వాస్తవాలను విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్న వాదన కూడా ఉంది.

# పండుగ సేల్స్ వేళ సైబర్ మోసాల కలకలం!




పండుగల సేల్స్ వేళ సైబర్ మోసాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అక్టోబర్ 1, 2026 రాత్రి నాటికి భారత్‌లో నకిలీ ఆఫర్లు, రీఫండ్ ఎరలు, వన్-టైమ్ పాస్‌వర్డ్ ఉచ్చులతో స్కామర్లు విరుచుకుపడుతున్నారు.కంగారులో చెకౌట్ చేసేవారిని ప్రధానంగా టార్గెట్ చేస్తున్నారు. కాబట్టి, మీ వాట్సాప్, యూపీఐ , బ్యాంక్ యాప్‌లను వెంటనే సెక్యూర్ చేసుకోండి. కేవలం పది నిమిషాల వ్యవధిలోనే మీ షాపింగ్ వేగానికి అడ్డుపడకుండా మోసాల బారిన పడకుండా ఉండే మార్గాలను ఇక్కడ వివరంగా తెలుసుకోండి.ముందుగా మీ వాట్సాప్ సెట్టింగ్స్ ఓపెన్ చేసి, టూ-స్టెప్ వెరిఫికేషన్ ఎనేబుల్ చేసుకోండి. దీనికోసం బలమైన పిన్, రికవరీ ఈమెయిల్ ఐడీని సెట్ చేయండి. ఆ తర్వాత 'లింక్డ్ డివైసెస్' విభాగంలో అనుమానాస్పద డివైస్‌లను లాగ్‌అవుట్ చేయండి. మీ వ్యక్తిగత చాట్‌లను లాక్ చేసి, సీక్రెట్ కోడ్ పెట్టుకోండి. ప్రైవసీ సెట్టింగ్స్‌లో గ్రూప్ పర్మిషన్లను 'మై కాంటాక్ట్స్ ఎక్సెప్ట్'కి మార్చండి. అకౌంట్ రికవరీ సేఫ్‌గా ఉండటానికి ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ బ్యాకప్‌లను ఆన్ చేసుకోండి.

వాట్సాప్, యూపీఐ, బ్యాంక్ యాప్‌ల సెక్యూరిటీ చెక్‌లిస్ట్

యూపీఐ యాప్‌ల కోసం.. మీ బ్యాంక్ సెట్టింగ్స్ ద్వారా రోజువారీ లావాదేవీల పరిమితిని తగ్గించుకోండి. గూగుల్ పే (Google Pay) ఓపెన్ చేసి ప్రొఫైల్ ఐ సెక్యూరిటీలోకి వెళ్లి 'యాప్ లాక్' ఎనేబుల్ చేసుకోండి; పేమెంట్స్ విభాగంలో 'ఆటోపే మ్యాండేట్లను' ఒకసారి చెక్ చేయండి. ఫోన్‌పే (ప్రత్యేకశీఅవూవ)లో 'మై మనీ' ఐ 'మ్యాండేట్స్'కి వెళ్లి అనవసరమైన వాటిని డిజేబుల్ చేయండి. భీమ్ యాప్‌లోనూ మ్యాండేట్ పరిమితిని తగ్గించడం లేదా క్యాన్సిల్ చేయడం చేయవచ్చు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మనీ కలెక్ట్ రిక్వెస్ట్‌లను నిరభ్యంతరంగా రిజెక్ట్ చేసి, ఆ నంబర్లను బ్లాక్ చేయండి.

జియో, ఎయిర్‌టెల్, వి: సిమ్-స్వాప్, పోర్ట్-అవుట్ మోసాలకు చెక్ పెట్టండిలా!

సిమ్-స్వాప్ (SIM-swap) మోసాల బారిన పడకుండా ఉండాలంటే మీ ఫోన్ సెట్టింగ్స్‌లో 'సిమ్ పిన్' (SIM PIN) ఎనేబుల్ చేయండి. ఒకవేళ సమస్య వస్తే జియో వినియోగదారులు 'వీఎజీఱశీ' యాప్‌లోని సెట్టింగ్స్ ఐ 'సస్పెండ్/రిజ్యూమ్' ఆప్షన్ ద్వారా వెంటనే సిమ్ ఫ్రీజ్ చేయవచ్చు. ఎయిర్‌టెల్ యూజర్లు 'ూఅతీవశ్రీ ష్ట్రుఅఎం' యాప్‌లో హెల్ప్ ఐ లాస్ట్ సిమ్ ఐ బ్లాక్ సిమ్ ఎంచుకోవాలి. వొడాఫోన్ ఐడియా వినియోగదారులు 'ఎఅ' యాప్‌లో లాస్ట్ సిమ్ ఆప్షన్ ఉపయోగించవచ్చు. ఏమైనా తేడా అనిపిస్తే, వెంటనే వేరే ఫోన్ నుండి కస్టమర్ కేర్‌ను సంప్రదించి సిమ్ సస్పెండ్ చేయించి, కొత్త సిమ్ తీసుకోండి.

నకిలీ డీల్ యాప్‌లు, డెలివరీ, రీఫండ్ ఉచ్చులతో జాగ్రత్త!

నకిలీ ఆఫర్ యాప్‌లను గుర్తించాలంటే ప్లే స్టోర్‌లో డెవలపర్ పేరు, రివ్యూలు, అప్‌డేట్ వివరాలను జాగ్రత్తగా గమనించండి. అనధికారిక మూలాల (సైడ్‌లోడింగ్) నుండి యాప్‌లను డౌన్‌లోడ్ చేయకండి. ట్రాకింగ్ లేదా రీఫండ్ పేరుతో వచ్చే లింక్‌లను అస్సలు నమ్మకండి, వాటి డొమైన్ పేరు సరిగ్గా ఉందో లేదో చెక్ చేయండి. కొత్త సేలర్స్ వద్ద కొనుగోలు చేసేటప్పుడు 'క్యాష్ ఆన్ డెలివరీ' ఎంచుకోవడమే శ్రేయస్కరం. డబ్బులు పొందడానికి ఎప్పుడూ ఓటీపీ షేర్ చేయాల్సిన అవసరం లేదు, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన పనిలేదు అనే విషయాన్ని గుర్తుంచుకోండి.

వెంటనే స్పందించే మార్గాలు, హెల్ప్‌లైన్ నంబర్లు

పొరపాటున ఏమైనా అనుమానాస్పద లింక్‌పై క్లిక్ చేశారా? వెంటనే ఫోన్‌ను 'ఎయిర్‌ప్లేన్ మోడ్'లో పెట్టండి. ఆ పేజీ స్క్రీన్‌షాట్లు తీసి, అనుమానాస్పద యాప్‌లను అన్‌ఇన్‌స్టాల్ చేసి ప్లే ప్రొటెక్ట్ (Play Protect) రన్ చేయండి. అఫీషియల్ యాప్ ద్వారా మీ యూపీఐ పిన్ (UPI PIN) రీసెట్ చేసి, మ్యాండేట్లను రద్దు చేయండి. వాట్సాప్ పిన్, సీక్రెట్ కోడ్ మార్చండి. సైబర్ మోసం జరిగి డబ్బులు పోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఆ ట్రాన్సాక్షన్‌ను ఫ్రీజ్ చేయించండి. అలాగే మీ బ్యాంక్‌కు సమాచారం అందించి, యాప్ ద్వారా కార్డులను లాక్ చేసి సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి.

ఫ్యామిలీ సేఫ్టీ చిట్కాలు, ఫోన్ పెర్ఫార్మెన్స్ టిప్స్

మీ కుటుంబ సభ్యుల భద్రత కోసం గూగుల్ ఫ్యామిలీ లింక్ ఎనేబుల్ చేయండి. వాట్సాప్‌లో అపరిచిత వ్యక్తుల కాల్స్‌ను సైలెంట్ చేయడంతో పాటు అనుమానాస్పద కాంటాక్ట్స్‌ను బ్లాక్ చేయండి. ముఖ్యమైన చాట్‌లను పిన్ చేయడం, బ్యాంక్ మెసేజ్‌లను స్టార్ చేయడంతో వేగంగా చెక్ చేసుకోవచ్చు. ఇక షాపింగ్ సమయంలో స్మూత్ చెకౌట్ కోసం.. షాపింగ్ యాప్‌ల క్యాషే క్లియర్ చేయండి, బ్యాక్‌గ్రౌండ్ యాప్‌లను క్లోజ్ చేసి, స్టోరేజ్ ఖాళీగా ఉంచుకోండి. ఈ చిన్న జాగ్రత్తలు మీ షాపింగ్ అనుభవాన్ని సురక్షితంగా, వేగవంతంగా మారుస్తాయి.

# అన్నాబత్తునికి బిగిస్తున్న ఉచ్చు

గుంటూరు, మాయ.. మంత్రం.. తంత్రం.. ఈ మూడు పదాలను ఆయన పాటించారు. బ్రహ్మాండంగా కోట్లు కొట్టేశారు. లేనిది ఉన్నట్టుగా భ్రమ కల్పించారు. మొత్తానికి మాయ చేసారు. కాకపోతే రోజులన్నీ ఒకే విధంగా ఉండవు కదా. అధికారంలో ఉన్నారు కాబట్టి అప్పట్లో ఎలా చేసినా చెల్లుబాటయింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అలాంటి అవకాశం కూడా లేదు. మొత్తంగా చూస్తే చేసిన మోసం.. సాగించిన వ్యవహారం అన్ని కళ్ళ ముందు కనిపిస్తున్నాయి.వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ కు సంబంధించిన వ్యవహారంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఆయన మెడకు ఉచ్చు గట్టిగానే బిగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే భూమికి సంబంధించిన వ్యవహారంలో పత్రాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఆయన రుణం తీసుకున్నట్టుగా చెబుతున్న ఏపీజే ఇంపెక్స్ అనే కంపెనీకి సంబంధించిన వ్యవహారాల విషయంలో కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్టు సమాచారం.విజయవాడ నగరంలో ఐకెఎఫ్ అనే ఫైనాన్స్ సంస్థ ఫిర్యాదు ఇచ్చిన నేపథ్యంలో తెనాలి ఒకటో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో కంపెనీకి సంబంధించిన చిరునామాలను పరిశీలించగా అక్కడ కంపెనీ కార్యాలయం బోర్డు.. ఇతర కార్యకలాపాలకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించలేదని విషయాన్ని పోలీసులు గుర్తించిన సమాచారం. పోలీసుల దర్యాప్తులో భాగంగా ఏపీజే ఇంపెక్స్ పేరుతో సుమారు మూడు కోట్ల రుణాన్ని శివకుమార్ 2019లో తీసుకున్నారు. రుణం పొందిన తర్వాత బ్యాంకు ఖాతాలలో జరిగిన లావాదేవీలు.. ఇతర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. లోన్ తీసుకున్న తర్వాత కంపెనీ పేరుతో శివకుమార్ వ్యాపార కార్యకలాపాలు సాగించలేదా.. కేవలం డబ్బు పొందడానికి మాత్రమే కంపెనీ పేరును ఉపయోగించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.. అయితే ఈ అంశాలకు సంబంధించి తృది నిర్ధారణ ఇంకా రావాల్సి ఉంది. అయితే ఈ కంపెనీ ద్వారా ఎటువంటి కార్యకలాపాలు సాగించారు.. రుణం ఎలా తీసుకున్నారు.. దానికి ఎటువంటి పత్రాలు సమర్పించారు.. అనే విషయాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత వెలుగులోకి వచ్చే అవకాశం ఉందిఈ కేసులో కంపెనీ నిర్వహణ.. లోన్ తీసుకోవడానికి సమర్పించిన పత్రాల వంటి వాటి మీద పోలీసులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. గతంలో భూమికి సంబంధించిన సర్వే వివరాలు.. ఎన్ కంబరెన్స్ సర్టిఫికెట్లు.. వంటి పత్రాల మీద అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వాటిని ఎవరు జారీ చేశారు.. ఎటువంటి ఆధారాలతో వాటిని ధ్రువీకరించారు.. సంబంధిత అధికారులు వాటి మీద సంతకాలు ఎలా పెట్టారు.. వంటి అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా తెనాలి పురపాలకం.. కొత్తపేట సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు.ప్రధానంగా ఏపీజే ఇంపెక్స్ కంపెనీ మీదనే ఇక్కడ ప్రశ్నలు వినిపిస్తున్నా. రిజిస్ట్రేషన్ చేసిన సమయంలో పేర్కొన్న కంపెనీ చిరునామా.. కార్యాలయం చేస్తున్న కార్యకలాపాలు.. బ్యాంకు ద్వారా సాగించిన లావాదేవీలు.. ఆడిట్ వ్యవహారాలు.. లోన్ తీసుకున్నప్పుడు సమర్పించిన ఆస్తి పత్రాలు.. ఇలా అన్ని అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.. ఒకవేళ పత్రాలలో పొందుపరచిన చిరునామాలలో కంపెనీ గనుక కార్యకలాపాలు సాగించలేదని తీరితే ఈ అంశం అత్యంత కీలకంగా మారుతుంది.కంపెనీ.. రుణం మంజూరు వంటి వాటికి పత్రాలు జారీ చేసిన నేపథ్యంలో వాటికి ప్రభుత్వ ధృవీకరణల

# హై రైజ్ భవనాలకు పొంచి ఉన్న నీటి ముంపు

హైదరాబాద్, భాగ్యనగరం సహా పలు ప్రధాన నగరాల్లో ఆకాశమే హద్దుగా వెలుస్తున్న హైరైజ్ భవనాలు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలలో వందలాది, వేలాది ఫ్లాట్లు నివాసం ఉంటున్నాయి. ఒకే ప్రాంగణంలో వేల సంఖ్యలో జనాభా నివసించే ఈ భారీ అపార్ట్‌మెంట్లలో నిత్యం కోట్లాది లీటర్ల నీరు అవసరమవుతుంది. కేవలం భూగర్భ జలాలపై మాత్రమే ఆధారపడితే కొన్ని రోజుల్లోనే భూగర్భ జలాలు అడుగంటిపోవడం, బోర్లు పూర్తిగా వట్టిపోవడం ఖాయం. దీంతో నగరాల్లోని పెద్ద పెద్ద టవర్ల నిర్వహణకు నీటి సరఫరా అనేది ప్రస్తుతం అత్యంత ఆందోళనకరమైన సమస్యగా మారుతోంది.సాధారణంగా నగరాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు , జలమండలి అందించే తాగునీటి సరఫరాపైనే ఈ హైరైజ్ ప్రాజెక్ట్‌లు ఆధారపడాల్సి ఉంటుంది. అయితే, మున్సిపల్ అధికారులు తగినంత నీటి కనెక్షన్‌లు లేదా మౌలిక వసతులు కల్పించని పక్షంలో ఆయా బిల్డర్లు, నివాసితులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ నుంచి సరైన సమయంలో నీటి సరఫరా అందకపోతే, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా రోజువారీ నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల అపార్ట్‌మెంట్లలో నివసించే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థికంగా అదనపు భారం విపరీతంగా పెరుగుతోంది.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా బిల్డర్లు ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే మున్సిపల్ జల సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ అనుమతులు పొందడం, భారీ సంపులు , ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టడం అత్యంత కీలకం. అంతేకాకుండా, నీటి వృధాను అరికట్టడానికి ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆ రీసైకిల్ చేసిన నీటిని ఫ్లషింగ్, గార్డెనింగ్ వంటి ఇతర అవసరాలకు విధిగా ఉపయోగించేలా అంతర్గత ప్లాంట్‌లను డిజైన్ చేయాల్సిన బాధ్యత బిల్డర్లపై ఉంటుంది.ప్రభుత్వాలు , స్థానిక సంస్థలు కూడా భారీ హైరైజ్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే ముందే, ఆ ప్రాంతానికి సమీపంలో తాగునీటి లభ్యత, సరఫరా సామర్థ్యం ఎంత ఉందనే దానిపై సమగ్ర అంచనా వేయాలి. తగిన మౌలిక వసతులు, తాగునీటి గ్రిడ్ కనెక్షన్లు కల్పించిన తర్వాతే భారీ భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలి. లేనిపక్షంలో, అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరిగినప్పటికీ కనీస తాగునీరు కూడా దొరకని దుస్థితి ఏర్పడి, రేపు భవిష్యత్తులో నగరాలు తీవ్రమైన నీటి యుద్ధాలను ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు.

# రకుల్ చుట్టూ రాజకీయాలు

ముంబై ,సినీనటి రకుల్ ప్రీత్ సింగ్ ఇంట్లో ఐటి అధికారులు సోదాలు మొదలుపెట్టారు. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మొత్తం 12 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేశారు. మధ్యాహ్నం దాటిన తర్వాత ఐటీ అధికారులు ఒక్కసారిగా బృందాలుగా విడిపోయి 12 ప్రాంతాలలో తనిఖీలు చేయడం మొదలుపెట్టారు.సినిమా ఫైనాన్సింగ్ పేరుతో నిధులను మళ్లించారని తెలుస్తోంది. ఇలా నిధులు మళ్లింపు విషయంలో కొన్ని కీలక విషయాలను రాబట్టడం ఐటి అధికారులకు అనుమానం కలిగించింది. దీంతో కొద్దిరోజులుగా వారు లోతుగా ఈ వ్యవహారాన్ని తవ్వుతున్నారు. దీంట్లో అనుమానాస్పద లావాదేవీలు కనిపించిన నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగారు. రకుల్ మామ వషూ భగ్నాని కార్యాలయంలో కూడా అధికారులు దాడులు చేస్తున్నారు. రకుల్ ఇంట్లో కూడా అధికారులు సోదాలు చేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కీలకమైన పత్రాలు.. రికార్డులను అధికారులు పరిశీలించినట్లు సమాచారం.రకుల్ కు తెలుగు చిత్ర పరిశ్రమలో అంతగా అవకాశాలు రావడం లేదు. దీంతో ఆమె బాలీవుడ్లో సినిమాలు చేస్తోంది. ఆమె నటించిన సినిమాలు కూడా అంతగా ఆడటం లేదు. అయినప్పటికీ ఆమెకు వరుసగా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. పైగా రియాల్టీ షోలలో.. టాక్ షోలలో ఆమె పాల్గొంటునే ఉంది. పైగా అప్పట్లో రకుల్ సోదరుడు మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నాడని ఆరోపణలొచ్చాయి. అతడిని పోలీసులు అరెస్ట్ కూడా చేశారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు. అయితే ప్రస్తుతం రకుల్ ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు చేశారని వార్తలు వస్తున్న నేపథ్యంలో టాలీవుడ్.. బాలీవుడ్..లో సరికొత్త చర్చ మొదలైంది.రకుల్ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమా ద్వారా ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత వరుసగా ఆమె నటించిన సినిమాలు విజయవంతం అయ్యాయి. దీంతో టాలీవుడ్లో మోస్ట్ డిమాండ్ ఉన్న హీరోయిన్గా ఆమె పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత చేసిన సినిమాలు వరుసగా ఫ్లాఫ్ కావడంతో ఆమెకు అవకాశాలు రావడం తగ్గిపోయింది. ఇదే అనే పద్యంలో ఆమె కొన్ని వ్యాపారాలు కూడా మొదలుపెట్టింది. ఆ తర్వాత క్రమంగా బాలీవుడ్ కు ఆమె షిఫ్ట్ అయిపోయింది. అక్కడ కొన్ని సినిమాలలో నటించింది. బలమైన పిఆర్ ద్వారా కొన్ని సినిమాల్లో అవకాశాలు పొందింది. అయితే ఆమె నటించిన సినిమాలు అంతగా ఆకట్టుకోలేదు. కెరియర్ డోలాయమానంలో ఉన్న క్రమంలో ఆమె పై ఈ స్థాయిలో విమర్శలు రావడం.. ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.రకుల్ ప్రీత్ కు వివాదాలు కొత్త కాదు. గతంలో ఆమె సోదరుడి మీద రకరకాల విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత కొన్ని వ్యవహారాలు ఆమెను వార్తల్లో వ్యక్తిగా నిలిపాయి. అయినప్పటికీ ఆమె వాటిని తట్టుకొని నిలబడింది. కానీ చివరికి ఇప్పుడు ఏకంగా ఐటీ శాఖ అధికారులు సోదాలు చేయడం చర్చకు దారి తీసింది. మరి ఈ దాడుల్లో అధికారులు ఏం స్వాధీనం చేసుకున్నారు.. ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు.. అనే వాటిపై మరికొద్ది గంటల్లో క్లారిటీ వస్తుందని తెలుస్తోంది.

## నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ కమిషన్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉచ్వాస్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో 'జస్ ఆంకో' పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ కేర్ సెంటర్‌ను గురువారం ఆయన సంస్థ వ్యవస్థాపకురాలు డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి బాలకృష్ణన్‌తో కలిసి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సకు ప్రభుత్వం నుంచి పలు సేవలు అందిస్తున్నప్పటికీ ప్రైవేట్ సంస్థలు కూడా రోగులకు అందుబాటు ధరల్లో వైద్యాన్ని అందించాలని, ఇలాంటి కేంద్రాలు మరిన్ని రావాలని సూచించారు. జస్ ఆంకో ఫౌండర్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తమిళనాడు కేంద్రంగా కొనసాగుతున్న తమ సంస్థ కార్యకలాపాలు దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నామని అందులో భాగంగానే తొలి కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని రోజుల తరబడి ఆస్పత్రుల్లో ఇన్‌పేషంట్‌గా ఉండాల్సిన అవసరం లేకుండానే ఎన్నో రకాల క్యాన్సర్ వ్యాధులకు డే కేర్ ప్రొసీజర్‌లో వైద్యం అందించనున్నట్లు ఆమె వెల్లడించారు. రోగులపై ఆర్థిక భారం తగ్గించే విధంగా తాము వైద్య చికిత్సా విధానలను అవలంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ డేకేర్ సెంటర్‌లో కీమోథెరపి, ఇమ్యునో థెరపి, టార్గెటెడ్ థెరపి వంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉచ్వాస్ రిహాబిలిటేషన్ సెంటర్స్ చైర్మన్ డాక్టర్ అంబటి రాంపాపారావు, ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ రీజినల్ సెంటర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ముక్త శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ లో లక్షా 23 వేల ఓట్లు గల్లంతు




హైదరాబాద్, దానం నాగేందర్ పై అనర్హత వేటు పడడంతో ఖైరతాబాద్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే ఇప్పుడు ఖైరతాబాద్‌లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ ప్రధాన రాజకీయ పార్టీల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నియోజకవర్గంలో ఊహించని విధంగా అనర్హత ఓట్లు పెద్ద ఎత్తున తెరపైకి వస్తున్నాయి. ఏకంగా సగం మేర ఓటర్ల జాబితా నుంచి మాయం కావడం ఇప్పుడు నగర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 2.93 లక్షలుగా ఉండేది. అయితే? గైర్హాజరు, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్.. తదితర కారణాలతో అధికారులు దాదాపు 1.23 లక్షల ఓట్లను తొలగించారు. దీనివల్ల ఇటీవల ప్రకటించిన ముసాయిదా జాబితాలో ఓటర్ల సంఖ్య 1.70 లక్షలకు పడిపోయింది. ఇందులోనూ మ్యాపింగ్, ఎనామలీస్ జాబితాలో ఉన్న మరో 81 వేల మందికి పైగా ఓటర్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు స్పందించి సరైన డాక్యుమెంట్లు సమర్పించని వారి పేర్లు కూడా తొలగించే అవకాశం ఉంది. అదే జరిగితే తుది జాబితా నాటికి ఇక్కడి ఓటర్ల సంఖ్య ఏకంగా 1.5 లక్షలకు పడిపోయే తీవ్ర అవకాశముంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ దాదాపు 22 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అనర్హత పడడంతో ఇప్పుడు మరోసారి ఎన్నిక అనివార్యమైంది. ఈ తరుణంలో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గిపోవడం ఏ పార్టీ విజయావకాశాలను దెబ్బతీస్తుందనే దానిపై సర్వత్రా తీవ్ర చర్చ జరుగుతోంది. పైకి మాత్రం ప్రధాన పార్టీలన్నీ తమ విజయానికి ధోకా లేదని చెప్తున్నాయి. కానీ, తెరవెనుక పరిణామాలు మాత్రం వారిలో గుబులు పుట్టిస్తున్నాయి. గల్లంతైన ఓట్లలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన సానుభూతిపరులు, కార్యకర్తలు ఉండటంతో ఎవరికి నష్టం జరుగుతుందో అంచనా వేయలేక పార్టీల వ్యూహకర్తలు తలలు పట్టుకుంటున్నారు.ఓట్ల తొలగింపు వ్యవహారం రాజకీయంగా పెను దుమారం రేపుతుండటంతో పార్టీలు అప్రమత్తమయ్యాయి. పార్టీ తరపున ఓట్లను పరిశీలించేందుకు ప్రత్యేక నిపుణులను, లీగల్ సెల్ ప్రతినిధులను రంగంలోకి దించారు. ముసాయిదా జాబితా పరిశీలన బాధ్యతలను కొందరి ముఖ్య నేతలకు అప్పగించారు. నోటీసులు అందుకున్న ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి, వారు సరైన డాక్యుమెంట్లు సమర్పించేలా చూడాలని నాయకులు క్షేత్రస్థాయి క్యాడర్‌ను ఆదేశించారు. అలాగే, ఎన్యుమరేషన్ ఫారాలు సక్రమంగా సమర్పించినప్పటికీ, సాంకేతిక లోపాలతో కొందరి పేర్లు ముసాయిదా జాబితాలో గల్లంతు కావడంతో, వారందరితో కొత్తగా ఫామ్-6 ద్వారా పేరు నమోదు చేయించేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. నవంబర్‌లో ఎస్ఐఆర్ తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. అప్పటివరకు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకూడదని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. =

### ఎన్నికల బరిలో జనసేన

ఖైరతాబాద్ ఉపఎన్నిక వేడి అప్పుడే మొదలైపోయింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కవిత పార్టీల మధ్య చతుర్ముఖ పోరు ఉంటుందనుకుంటే, ఇప్పుడు జనసేన పార్టీ ఎంట్రీతో హైదరాబాద్ రాజకీయం ఒక్కసారిగా ఆసక్తికరంగా మారింది. ఇటీవలి కాలంలో తెలంగాణలో జనసేన పార్టీ వేగంగా పుంజుకుంటోంది. పార్టీ జనరల్ సెక్రటరీ రామ్ తాళ్లూరి తెలంగాణ రాజకీయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు స్పెషల్ ప్లాన్స్ వేస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రేటర్ పరిధిలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ మార్కు చూపించాలంటే, ఇప్పుడు వచ్చే ఖైరతాబాద్ ఉపఎన్నికను పక్కాగా వాడుకోవాలని జనసేన ప్లాన్ చేస్తోంది.ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఈసారి బీజేపీతో సంబంధం లేకుండా స్వీయ బలంతోనే ఖైరతాబాద్‌లో గ్లాస్ గుర్తును నిలబెట్టాలని జనసేన నిర్ణయించినట్లు కనిపిస్తోంది. పొత్తుల వైపు చూడకుండా ఒంటరిగానే బరిలోకి దిగి జనసేన ఓటు బ్యాంక్ ఏంటో నిరూపించుకోవాలనే ఆలోచనలో రామ్ తాళ్లూరి ఉన్నారు. గ్రేటర్ ఎన్నికలకు ముందు జరిగే ఈ సెమీఫైనల్ పోరులో ఖైరతాబాద్ లాంటి ప్రతిష్టాత్మక స్థానంలో పోటీ చేస్తే, పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం రావడమే కాకుండా అది బలమైన పునాదిగా మారుతుందని భావిస్తున్నారు.ఖైరతాబాద్ బరిలో దింపేందుకు జనసేన ఒక సీనియర్ సినీ నటుడి పేరును పరిశీలిస్తున్నట్లు ఫిలింనగర్, రాజకీయ వర్గాల్లో విపరీతంగా ప్రచారం జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు అత్యంత ఆప్తుడిగా ఉంటూ, ప్రజల్లో మంచి గ్లామర్, ఫాలోయింగ్ ఉన్న ఒక ప్రముఖ నటుడిని ఈ సీటు నుంచి బరిలోకి దింపే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయట. స్థానిక ఓటర్లతో పాటు యువతను, సినిమా అభిమానులను ఆకట్టుకోవడానికి ఈ గ్లామర్ కాంబినేషన్ పక్కాగా వర్కవుట్ అవుతుందని పార్టీ భావిస్తోంది.ఒకవేళ ఆ సినీ నటుడు ఖైరతాబాద్ రేసులో దిగడం నిజమే అయితే.. ఇన్నాళ్లూ దానం నాగేందర్, తలసాని కుటుంబం,

# వేసవి నీటి సరఫరాకు ముందస్తు కార్యాచరణ

హైదరాబాద్, రానున్న వేసవిలో హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత, ప్రాంతాల వారీగా డిమాండ్, పంపిణీ వ్యవస్థ, ప్రత్యామ్నాయ జలవనరులు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలను సమగ్రంగా విశ్లేషించి క్షేత్రస్థాయిలో అమలు చేయగల ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. సింగూరు--మంజీరా జలవనరులపై ఆధారపడిన ప్రాంతాల్లో వేసవిలో నీటి సరఫరాపై ప్రభావం పడకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని అందించేలా ప్రాంతాల వారీగా కాంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జేఎండీ మయాంక్ మిట్టల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వేసవి నీటి సరఫరా సన్నద్ధత, సింగూరు--మంజీరా కాంటింజెన్సీ ప్లాన్, పవర్ బోర్‌వెల్స్ నిర్వహణ, ఫిల్లింగ్ స్టేషన్ల విస్తరణ, నెట్‌వర్క్ అనుసంధానం, పారిశ్రామిక--బల్క్ నీటి సరఫరా, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు.

### సింగూరు-మంజీరా ప్రాంతాలకు ప్రత్యేక ప్రణాళిక

సింగూరు, మంజీరా జలవనరులపై ఆధారపడిన ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించాలని ఎండీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆయా ప్రాంతాలకు ఏ ప్రత్యామ్నాయ జలవనరు నుంచి, ఏ మార్గంలో, ఎంత పరిమాణంలో నీటిని సరఫరా చేయవచ్చనే అంశాలతో స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ నీటి సరఫరాకు అవసరమైన ఇంటర్‌కనెక్షన్లు, జంక్షన్లు, వాల్వ్ ఆపరేషన్లు, పైప్‌లైన్ అనుసంధానాలను ముందుగానే పరిశీలించాలని సూచించారు. వేసవిలో అధిక నీటి అవసరం ఉండే ప్రాంతాలు, చివరి ప్రాంతాలు, తక్కువ ఒత్తిడితో నీరు అందుతున్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట నెట్‌వర్క్ బలోపేతానికి సాంకేతిక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

### నీటి వృథాపై కఠిన చర్యలు

వేసవిలో నీటి డిమాండ్ పెరిగే నేపథ్యంలో నీటి వృథాను అరికట్టడం అత్యంత ప్రాధాన్య అంశమని ఎండీ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. జలమండలి సరఫరా చేస్తున్న తాగునీటిని అనవసరంగా వృథా చేయడం, గృహేతర అవసరాలకు వినియోగించడం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో గుర్తించి నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నీటి వృథా చేస్తున్న వారికి మొదట అవగాహన కల్పించాలని, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.అదే సమయంలో కేవలం నియంత్రణ చర్యలకే పరిమితం కాకుండా ప్రజల్లో నీటి సంరక్షణపై బాధ్యతాయుతమైన వినియోగ సంస్కృతిని పెంపొందించాలని తెలిపారు. నీటి పొదుపు పద్ధతులు, వేసవిలో నీటి అవసరాలు, అందుబాటులో ఉన్న వనరుల పరిరక్షణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో నీటి సంరక్షణపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

### ఫిల్లింగ్ స్టేషన్ల సామర్థ్యం పెంచాలి

వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అవసరం పెరిగే అవకాశం ఉన్నందున ప్రస్తుతం ఉన్న ఫిల్లింగ్ స్టేషన్ల సామర్థ్యాన్ని సమీక్షించాలని ఎండీ ఆదేశించారు. ట్యాంకర్లు ఎక్కువ దూరం ప్రయాణించకుండా నీటి అవసరం ఉన్న ప్రాంతాలకు సమీపంలో ఫిల్లింగ్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్త ఫిల్లింగ్ స్టేషన్లు అవసరమైన ప్రాంతాలను గుర్తించి, స్థలం, నీటి వనరు, మౌలిక సదుపాయాలు, వ్యయం, అమలు గడువుతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.




పవర్ బోర్‌వెల్స్‌కు ప్రత్యేక బాధ్యతలు

ప్రస్తుతం పనిచేస్తున్న పవర్ బోర్‌వెల్స్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎండీ తెలిపారు. ప్రతి పవర్ బోర్‌వెల్‌కు 15 రోజుల్లోగా ఒక లైన్‌మెన్‌ను ఇన్‌ఛార్జ్‌గా నియమించాలని ఆదేశించారు. బోర్‌వెల్ స్థానం, డివిజన్, ఇన్‌ఛార్జ్ వివరాలు, నీటి లభ్యత, పని చేసే సమయం, సరఫరా చేసే ప్రాంతాల వివరాలతో కేంద్రీకృత ఆన్‌లైన్ డేటాబేస్ రూపొందించాలని సూచించారు. ప్రతి బోర్‌వెల్‌కు అవసరానికి అనుగుణంగా ఆపరేషనల్ క్యాలెండర్ రూపొందించాలని, సాధారణ నీటి సరఫరా అందుబాటులో ఉన్న సమయంలో బోర్‌వెల్స్‌ను అనవసరంగా వినియోగించకుండా అత్యవసర అవసరాలకు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. పనిచేయని బోర్‌వెల్స్‌లో వేసవిలో ఉపయోగపడే వాటిని గుర్తించి ప్రాధాన్య క్రమంలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

### ట్రీటెడ్ వాటర్ వినియోగాన్ని పెంచాలి

తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు శుద్ధి చేసిన మురుగునీటిని (ట్రీటెడ్ వాటర్) గరిష్ఠంగా వినియోగించాలని ఎండీ సూచించారు. ల్యాండ్‌స్కేపింగ్, పార్కులు, నిర్మాణ రంగం, సెంట్రల్ మీడియన్లు, ఇతర గృహేతర అవసరాలకు ట్రీటెడ్ వాటర్‌ను మళ్లించాలని ఆదేశించారు.

జలమండలి ఆధ్వర్యంలోని ఎస్టీపీల వద్ద సాంకేతికంగా సాధ్యమైన ప్రాంతాల్లో ట్రీటెడ్ వాటర్ ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి విస్తరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో ట్రీటెడ్ వాటర్ లభ్యత, అవసరమయ్యే ప్రాంతాలు, సరఫరా మార్గాలపై సోర్స్--డిమాండ్ మ్యాపింగ్ చేపట్టాలని ఆదేశించారు.

### ప్రైవేట్ ఎస్టీపీల వివరాల సేకరణ

నగరంలోని ప్రైవేట్ ఎస్టీపీలను కూడా ట్రీటెడ్ వాటర్ వనరులుగా పరిగణించాలని ఎండీ ఆదేశించారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ సముదాయాలు, భారీ నివాస--వాణిజ్య ప్రాజెక్టుల్లో ఉన్న ఎస్టీపీలపై సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. వాటి సామర్థ్యం, రోజువారీ శుద్ధి చేసిన నీటి లభ్యత, నాణ్యత, ప్రస్తుతం వినియోగిస్తున్న విధానం వంటి వివరాలను ఆన్‌లైన్ డేటాబేస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. 15 రోజుల్లో ప్రైవేట్ ఎస్టీపీలకు సంబంధించిన పూర్తి మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు.

### పారిశ్రామిక సరఫరాపై ముందస్తు అంచనా

పారిశ్రామిక, బల్క్ వినియోగదారులకు అందిస్తున్న నీటి సరఫరాను కూడా సమీక్షించాలని ఎండీ ఆదేశించారు. సింగూరు--మంజీరా కాంటింజెన్సీ అమలు చేయాల్సిన పరిస్థితి వస్తే పారిశ్రామిక సరఫరాపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

### అమలు చేయగల ప్రణాళికలు సిద్ధం చేయాలి

వేసవి సన్నద్ధతకు సంబంధించిన ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయగలిగేలా ఉండాలని ఎండీ స్పష్టం చేశారు. ప్రతి ప్రతిపాదనలో ప్రస్తుత పరిస్థితి, సమస్య, పరిష్కారం, చేపట్టాల్సిన పనులు, అంచనా వ్యయం, గడువు, బాధ్యత వహించే అధికారుల వివరాలు స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు తమ పరిధిలోని ప్రాంతాలను పరిశీలించి కాలపరిమితితో కూడిన వేసవి కాంటింజెన్సీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జలమండలి మల్కాజ్‌గిరి ఈడీ పంకజ, ఆపరేషన్ డైరెక్టర్లు నారాయణ, సత్యనారాయణ, కిరణ్‌కుమార్, టెక్నికల్ డైరెక్టర్ ప్రభు, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, ట్రాన్స్‌మిషన్, ఐటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

న్యూఢిల్లీ,లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్యసర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధానిభారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీయూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్ఛర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేదుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ

# యూపీలో ఎస్పీ రథయాత్ర...



న్యూఢిల్లీ, ఎన్నికలంటే అన్ని పార్టీలూ ఏదో ఒక యాత్ర చేపడతాయి. అది పాదయాత్రా? బస్సు యాత్రా? రథ యాత్రా? ఇలా రకరకాల యాత్రలను నిర్వహిస్తూ, ప్రజలకు దగ్గరవ్వడానికి ప్రయత్నాలు చేస్తారు. ఇది కలిసొస్తుంది కూడా. చాలా మంది నేతలు ఈ యాత్రలతో అత్యంత కీలకమైన పదవులను పొందగలిగారు కూడా.ఇప్పుడు ఇదే కోవలో సమాజ్ వాదీ పార్టీ అధినేత, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా వచ్చి చేరారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, లక్నో నుంచి రాయ్‌బరేలీ వరకు 'ఖఆం రథ యాత్ర' ప్రచారాన్ని ప్రారంభించారు. 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం చేపట్టిన ఈ యాత్రలో భాగంగా, పార్టీ కార్యకర్తలతో కూడిన ఎరుపు రంగు బస్సులు గురువారం రాష్ట్ర రాజధాని నుంచి బయలుదేరాయి. వెనుకబడిన వర్గాలు, దళితులు మరియు మైనారిటీల (పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్) కూటమిపై దృష్టి సారిస్తూ, మధ్య ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ చేపట్టిన విస్తృత ప్రచారంలో భాగంగా ఈ 'ఖఆం రథ' యాత్రను నిర్వహిస్తున్నారు.దీనిని అఖిలేష్ యాదవ్ ప్రగతిశీల, సానుకూల దృక్పథం కలిగిన కూటమిగా అభివర్ణించారు.ఏ వర్గాలనైతే దృష్టిలో పెట్టుకొని అఖిలేష్ రథయాత్రను ప్రారంభించారో, అవే వర్గాలు గత ఎన్నికల్లో బీజేపీకి గంపగుత్తగా మద్దతిచ్చాయి. అందులో కొన్ని ఎంఐఎంకి మద్దతిచ్చాయి. ఈ సారి వాటిని చీల్చాలని అఖిలేష్ ఓ వ్యూహం కూడా వేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ రథ యాత్రకు అఖిలేష్ అచ్చు అలాంటి పేరే పెట్టారు కూడా. పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్ అని రథ యాత్ర పేరు.అంతేకాకుండా ఒక్క రథయాత్రతో మూడు లక్ష్యాలను సాధించాలని అఖిలేష్ లక్ష్యంగా పెట్టుకున్నారు. కుల ప్రాతిపదికన ప్రజలను సమీకరించడం, ప్రెషర్ పాలిటిక్స్ ను తెరపైకి తేవడం రెండోది, ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం. ఈ మూడు లక్ష్యాల కోసం ఈ యాత్రను చేపడుతున్నారు.రాహుల్ గాంధీ పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్‌బరేలీకి అఖిలేష్ ' రథం' రాకపై వివిధ రాజకీయ విశ్లేషణలు వ్యక్తమవు తున్నాయి. మరోవైపు, లోక్‌సభ ఎన్నికల మాదిరిగానే అసెంబ్లీ ఎన్నికల్లోనూ 'ఇండియా' కూటమి పటిష్టంగా కొనసాగుతుందని అఖిలేష్ యాదవ్ స్పష్టం చేస్తున్నారు. ఈ కూటమిలో సీట్ల పంపకాలకు సంబంధించి ఇరు పార్టీల నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ ఎంపీ అయినప్పటికీ, 1999 నుండి కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని నిరంతరాయంగా తన ఆధీనంలో ఉంచుకుంటూ వస్తోందన్న విషయాన్ని గమనించాలి. అయితే, ఆ ప్రాంతంలో పార్టీకి ఒక్క అసెంబ్లీ స్థానం కూడా లేదు. రాయ్‌బరేలీలో మొత్తం ఆరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి; 2022 అసెంబ్లీ ఎన్నికల్లో వీటిలో నాలుగింటిని ఎస్పీ గెలుచు కోగా, రెండింటిని బీజేపీ గెలుచుకుంది. ఈ సారి రాయ్ బరేలీపై కూడా అఖిలేష్ కన్నేశారు.

### బాలిక,యువకుడు ఆత్మహత్య

గుంటూరు,ఎలుకల మందు తిని చెరువులో దూకి పదో తరగతి చదివే బాలిక, ఇంటర్ చదివిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. గుంటూరు జిల్లా కాకుమాను మండల కేంద్రంలో ఉండే తాత, అమ్మమ్మ వద్ద ఉంటూ ఓ బాలిక (15) పదో తరగతి చదువుతోంది. బాలిక చదువుతున్న స్కూల్ బస్సుకు డ్రైవర్గా పని చేస్తున్న సాంబశివరావు కొడుకు విష్ణేష్ (22) ఇంటర్ పూర్తి చేసుకొని ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తండ్రి కోసం తరచూ స్కూల్ వద్దకు వెళ్తూ బాలికతో పరిచయం పెంచుకుని విష్ణేష్ ప్రేమలో పడ్డాడు.

# ఆర్‌జీ కర్ కేసులో బిగ్ ట్విస్ట్: సాక్ష్యాల ధ్వంసం కేసు సీబీఐకి బదిలీ!




కోల్ కతా :కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలి హత్యా చార ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితురాలి మృతదేహాన్ని హడావుడిగా దహనం చేయడం, ఘటనా స్థలంలో సాక్ష్యాల ధ్వంసం ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్న కేసును కలకత్తా హైకోర్టు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.ఒకే అంశంపై రాష్ట్ర పోలీసు విభాగం, కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సమాంతరంగా దర్యాప్తు నిర్వహించలేవని జస్టిస్ శంపా సర్కార్, జస్టిస్ తీర్థంకర్ ఘోష్‌లతో కూడిన డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. 2024 ఆగస్టులో జరిగిన ఈ దారుణ ఘటనకు సంబంధించి విస్తృత కుట్ర కోణాన్ని ఇప్పటికే సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తున్న విషయాన్ని న్యాయస్థానం గుర్తుచేసింది.బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఖర్దా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు రికార్డులన్నింటినీ తక్షణమే సీబీఐ సిట్‌కు అప్పగించాలని హైకోర్టు ఆదేశించింది. ఖర్దా పోలీసులు ఇకపై ఈ కేసులో ఎటువంటి దర్యాప్తు చర్యలు చేపట్టరాదని నిర్దేశించింది. ఒకవేళ ఎవరైనా నిందితులు పోలీసు కస్టడీలో ఉంటే, వారి కస్టడీ కొనసాగింపుపై సీబీఐ సిట్ సంబంధిత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని తెలిపింది.హైకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలో రాష్ట్ర పోలీసులు సమాంతర విచారణను ఎలా ప్రారంభించారని ప్రశ్నించిన కోర్టు.. పోలీసు అధికారులు ఇచ్చిన వివరణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించింది. కాగా, 2024 ఆగస్టు 9న డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఈ దారుణం దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ హత్యాచారం కేసులో ఇప్పటికే మాజీ సివిక్ వాలంటీర్ సంజయ్ రాయ్‌కి సీల్దా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అయితే, ఘటన జరిగిన వెంటనే ఆధారాలను చెరిపివేసేందుకు, కేసును తొక్కిపెట్టేందుకు భారీ కుట్ర జరిగిందని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించడంతో తాజా ఉత్తర్వులు వెలువడ్డాయి.

### రెజ్లింగ్ పోటీలకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థినిలు ఎంపిక

తాండూర్ : రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు మంచిర్యాల జిల్లా అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినిలు ఎంపికైనట్లు పీడీ ఏ సాంబమూర్తి తెలిపారు. ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి రెజ్లింగ్ అండర్-14 62కేజీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన పి అశ్విత ,అండర్-17 42 కేజీ విభాగంలో చౌల్ల హర్షిత , 72కేజీ విభాగంలో కే శ్రీవల్లి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని

# 'బైపోల్'లో 'జనసేన' నేను సైతం !




హైదరాబాద్, ముక్కోణపు ఖైరతాబాద్ ఉప ఎన్నికలో నేను సైతం అంటూ 'జనసేన' పార్టీ కదం తొక్కే ప్రయత్నాలు చేస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి తాము సిద్ధమంటూ ఆ పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అప్పటి వరకూ ఉనికిని కాపాడుకునే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి సంస్థాగతంగా బలోపేతం కావాలన్న వ్యూహంతో పవన్ మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు విశ్లేషణలు జరుగుతున్నాయి.అదే క్రమంలో తెలంగాణలో పోటీ తప్పనిసరి అంటూ పవన్ అభిమానులు పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో జనసేన భవిష్యత్తుకు ఇదే మొదటి లిట్మస్ టెస్ట్ అని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. హైకోర్టు తీర్పుతో దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటం, తెలంగాణ అసెంబ్లీ ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైంది.తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలక పాత్ర పోషిస్తామని, 2029 స్థానిక ఎన్నికలు, అసెంబ్లీ పోరులో గట్టిగా నిలబడతామని పవన్ కళ్యాణ్ ఇటీవల స్పష్టం చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్తలు, విద్యార్థి సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తూ జనసేన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ఇలాంటి సమయంలో ఖైరతాబాద్ ఉపఎన్నిక రూపంలో జనసేనకు మొదటి అసలైన పరీక్ష ఎదురైంది. పార్టీని తెలంగాణలో సీరియస్‌గా తీసుకోవాలంటే ఖైరతాబాద్ బరిలో నిలవడం తప్పనిసరిగా భావిస్తున్నారు.ఒకవేళ బరి నుంచి తప్పుకుంటే 'జనసేన' పార్టీ ఆంధ్రకే పరిమితమన్న ముద్ర వేస్తూ.. రాజకీయాల్లో ప్రచారం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ కోణంలో ఓ వైపు కాంగ్రెస్, మరోవైపు బీఆర్ఎస్ నేతలు ప్రజల్లోకి మరింత గట్టిగా అడుగులు వేసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలో ఉన్నప్పటికీ, తెలంగాణ విషయంలో బీజేపీ శ్రేణులు ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ, ఉపఎన్నికల్లో ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని బిజెపి తెలంగాణ నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సమయంలో చివరి నిమిషంలో జనసేన తప్పుకుని బీజేపీకి మద్దతు ప్రకటించింది. కానీ ఈసారి కూడా అదే పునరావృతమైతే జనసేన ఇక్కడి క్షేత్రస్థాయి క్యాడర్‌ను తీవ్రంగా నిరాశ పరిచినట్లవుతుంది. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నారు. ఖైరతాబాద్ బరిలో స్వయంగా అభ్యర్థిని దింపితే, బీజేపీతో గ్యాప్ వచ్చే ప్రమాదం ఉంది.పోనీ అభ్యర్థిని నిలబెట్టకుండా బీజేపీకి మద్దతు ప్రకటించి సైలెంట్ అయిపోదామంటే, పొత్తులు వద్దంటున్న బీజేపీకి బలవంతంగా మద్దతు ఇస్తున్నారా? అనే విమర్శలు ఇతర పార్టీల నుంచి కూడా వస్తాయి. అందువల్ల ఉపఎన్నికలో పోటీ చేయడం ద్వారా తెలంగాణలో తమ స్వతంత్ర ఉనికిని చాటుకోవాలా లేదా సంయమనం పాటించాలా అనే ధర్మసందేహంలో పవన్ కళ్యాణ్ ఉన్నారు.హైదరాబాద్ నగరంలో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఆంధ్ర మూలాలు ఉన్న ఓటర్లు, అలాగే పవన్ కళ్యాణ్‌కు విశేషమైన అభిమాన గణం, యువత, బీసీ ఓటు బ్యాంకు గణనీయంగా ఉంది. పవన్ ప్రచారానికి వస్తే ఆ ప్రభావం ఖచ్చితంగా ఓట్లపై పడుతుంది. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లపై అసంతృప్తిగా ఉండి, సాంప్రదాయకంగా బిజెపికి పడని ఓటర్లను ఆకర్షించే అవకాశం జనసేనకు ఉంది. ఖైరతాబాద్ వంటి కీలక స్థానంలో పోటీ చేయాలంటే కేవలం గ్లాస్ గుర్తు ఉంటే సరిపోదు.. గట్టి ఆర్థిక, అంగ బలం ఉన్న అభ్యర్థి కావాలి.స్థానికంగా బలం ఉన్న శ్రేణులను లేదా ఇతర పార్టీల నుంచి అసంతృప్త నేతలను ఆకర్షించి అభ్యర్థిగా నిలబెడితేనే పోరు ఆసక్తికరంగా మారుతుంది. ఒకవేళ క్యాండిడేట్‌ను నిలబెడితే, పవన్ కళ్యాణ్ వచ్చి స్వయంగా ప్రచారం చేయాల్సిందే. అలా చేయని పక్షంలో క్యాడర్‌కి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కళ్యాణ్, తెలంగాణలో ప్రచారానికి వస్తే వచ్చే రాజకీయ పొలిటికల్ మైలేజ్ అంతా ఇంతా కాదు.ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రకటనతో జనసేన ఒక కీలక మలుపు వద్ద నిలబడింది. పొత్తులతో సంబంధం లేకుండా పోటీ చేసి తమ నిజమైన ఓటు బ్యాంకు ఎంతో తేల్చుకోవడం ఒక మార్గమైతే, బీజేపీతో సామరస్యంగా చర్చించి ఏకాభిప్రాయానికి రావడం మరొక మార్గం. ఏది ఏమైనా, తెలంగాణలో తన సీరియస్‌నెస్‌ను నిరూపించుకోవాలంటే పవన్ కళ్యాణ్ ఈ ఉపఎన్నికను తేలికగా తీసుకోలేరు. ఖైరతాబాద్ బరిలో జనసేన మార్క్ ఎలా ఉండబోతోందో రాబోయే కొన్ని రోజుల్లో తేలిపోనుంది.

# ఉక్రెయిన్ వార్‌ను ఆపే మంచి ఆలోచనలు మోదీ వద్ద ఉన్నాయి : పుతిన్




మాస్కో: ప్రధాని మోదీని పుతిన్ ప్రశంసించారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించే అంశంపై ప్రధాని మోదీ వద్ద మంచి ఐడియాలు ఉన్నాయంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఉమ్మడి అంగీకారం ద్వారా యుద్ధాన్ని ఆపే ఐడియాలు మోదీ వద్ద ఉన్నట్లు పుతిన్ తెలిపారు.తనతో భేటీ అయిన ప్రతిసారి యుద్ధాన్ని ఆపే అంశం గురించి ఆయన చర్చిస్తుంటారని పుతిన్ పేర్కొన్నారు. వల్దాయి ఇంటర్నేషనల్ డిస్కషన్ క్లబ్ మీటింగ్ సమయంలో పుతిన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధాలను ఆపడంలో మోదీ వ్యూహం ప్రత్యేకమైందని, ప్రపంచ నేతల్లో ఆయన ఒకరు అని, ఆయనతో మంచి సంబంధాలు ఉన్నాయని, స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, వ్యక్తిగతంగానూ మంచి రిలేషన్ ఉందని, ఎక్కడ కలిసినా ప్రతిసారి ఉక్రెయిన్ యుద్ధం ముగింపు గురించి అడుగుతుంటారని పుతిన్ అన్నారు. ఉమ్మడిగా అంగీకరం కుదుర్చుకునే ఐడియాలు ఆయన వద్ద చాలా ఉన్నాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సమావేశాల సమయంలోనూ ఉక్రెయిన్ వార్ గురించి మోదీ అడిగారన్నారు. ఇండియా చేపట్టే శాంతి ప్రయత్నాలను స్వాగతిస్తామని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పిస్కోవ్ తెలిపారు. చర్చలు, దౌత్యంతో ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించాలని భారత్ చేస్తున్న సూచనలను తాము కూడా అంగీకరిస్తున్నట్లు దిమిత్రీ వెల్లడించారు.

# ఎన్‌పీడీసీఎల్‌లో సౌర వెలుగులు..



హైదరాబాద్, పునరుత్పాదక ఇంధన రంగంలో తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీ-జీఎన్‌పీడీసీఎల్) కీలక మైలురాయిని సాధించింది. పీఎం కుసుమ్-ఏ పథకం కింద సంస్థ పరిధిలోని 18 సర్కిళ్లలో కలిపి 100 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించినట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. రానున్న మూడు నుంచి నాలుగు నెలల్లో మరో 200 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని గ్రిడ్‌కు అనుసంధానం చేసి మొత్తం సామర్థ్యాన్ని 300 మెగావాట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.రైతుల భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తితో పాటు వారికి అదనపు ఆదాయ మార్గాలను కల్పించడమే పీఎం కుసుమ్-ఏ పథకం ఉద్దేశమని సీఎండీ పేర్కొన్నారు. రైతులు తమ భూముల్లో సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, అదనంగా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రస్తుతం మరో 200 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యానికి సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని వరుణ్‌రెడ్డి చెప్పారు. ఆయా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి నిర్దేశిత గడువులోగా గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సౌర విద్యుత్ విస్తరణతో రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు స్థానికంగా పునరుత్పాదక విద్యుత్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు, పర్యావరణహిత విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు సౌర విద్యుత్ విస్తరణ దోహదపడుతుందని సీఎండీ తెలిపారు. రైతుల ఆర్థిక సాధికారత, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్, సంస్థ పునరుత్పాదక ఇంధన సామర్థ్య విస్తరణ లక్ష్యాలతో టీ-జీఎన్‌పీడీసీఎల్ ముందుకు సాగుతోందని చెప్పారు.పీఎం కుసుమ్-ఏ అమలులో 18 సర్కిళ్లకు చెందిన అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి 100 మెగావాట్ల మైలురాయిని సాధించారని వరుణ్‌రెడ్డి అభినందించారు. త్వరలో 300 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యానికి చేరుకోవడం సంస్థ పునరుత్పాదక ఇంధన విస్తరణలో మరో కీలక ఘట్టంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# అందుకే అక్కడ ఓడిపోతున్నాం.. బీజేపీ నేత సంచలన వ్యాఖ్యలు



కేరళ: కేరళ రాజకీయాల్లో ఇన్నాళ్లూ వినిపించిన కథకు బీజేపీ నేత కేఎస్ రాధాకృష్ణన్ కొత్త కోణాన్ని తెరపైకి తెచ్చారు. 'లెఫ్ట్.. సెక్యులర్.. లిబరల్' రాజకీయాలకు కేరళ కేరాఫ్ అడ్రస్ అనే ప్రచారాన్నే ఆయన ప్రశ్నించారు. కమ్యూనిస్టులే కేరళలో చారిత్రకంగా ఆధిపత్య హిందూ రాజకీయ శక్తిగా పనిచేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయన వ్యాఖ్యలు కేరళ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి.ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్‌లో మాట్లాడిన కేఎస్ రాధాకృష్ణన్.. కేరళలో కమ్యూనిస్టుల ఎదుగుదల కేవలం వామపక్ష సిద్ధాంతాల ప్రజాదరణతోనే జరగలేదని వాదించారు. 1921 మలబార్ తిరుగుబాటు తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, హిందువుల్లో ఏర్పడిన రాజకీయ పరిస్థితులు కమ్యూనిస్టు ఉద్యమానికి అనుకూలంగా మారాయని ఆయన పేర్కొన్నారు. అప్పట్లో మలబార్‌లో జరిగిన పరిణామాల అనంతరం బాధిత హిందువులకు కాంగ్రెస్ తగినంతగా అండగా నిలవలేదని రాధాకృష్ణన్ ఆరోపించారు. దీంతో కాంగ్రెస్‌పై ఒక వర్గంలో అపనమ్మకం ఏర్పడిందని.. ఆ రాజకీయ ఖాళీలో కమ్యూనిస్టు ఉద్యమం బలపడిందని ఆయన వివరించారు.

'శబరిమల ఘటన కూడా కీలకమే'

1950లో జరిగిన శబరిమల అగ్నిప్రమాదం ఘటనను కూడా కమ్యూనిస్టుల రాజకీయ ఎదుగుదలతో రాధాకృష్ణన్ ముడిపెట్టారు. ఆ ఘటన అనంతరం ఈఎంఎస్ నంబూద్రిపాద్ ఇచ్చిన హామీలు రాజకీయంగా కమ్యూనిస్టులకు మద్దతు పెరగడానికి దోహదపడ్డాయని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు.. తొలి కమ్యూనిస్టు ఉద్యమంలో వివిధ హిందూ సామాజిక వర్గాలకు చెందిన నేతలు ఉన్నారని రాధాకృష్ణన్ గుర్తుచేశారు. నంబూద్రిపాద్‌తో పాటు ఎన్ఎస్ఎస్, ఎస్ఎన్‌డీపీకి సంబంధించిన నాయకులు కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకంగా ఉన్నారని చెప్పారు. అందుకే కమ్యూనిస్టు పార్టీని కేవలం లౌకిక-వామపక్ష రాజకీయ శక్తిగా చిత్రీకరించడం వాస్తవాలకు దూరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

బీజేపీకి ఎందుకు ఇబ్బంది?

కేరళలో బీజేపీకి ఇప్పటికీ పరిమిత రాజకీయ విజయం మాత్రమే ఎందుకు దక్కుతోందన్న ప్రశ్నపైనా రాధాకృష్ణన్ తన విశ్లేషణను వెల్లడించారు. హిందూ ఓటు కోసం బీజేపీ పోటీ పడుతున్న రాజకీయ స్థలంలో ఇప్పటికే కమ్యూనిస్టులకు బలమైన ప్రభావం ఉందని ఆయన అన్నారు. ఇతర, వర్గాలు కాంగ్రెస్‌ను తమ సహజ రాజకీయ వేదికగా ఎంచుకున్నారని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. దీంతో బీజేపీకి ఆ వర్గాల నుంచి పెద్దగా ఓట్లు రావడం లేదని చెప్పారు. అయితే ఓటర్ల ఆలోచనా విధానంలో మార్పులు వస్తే కేరళలో బీజేపీ భవిష్యత్తులో కీలక రాజకీయ శక్తిగా ఎదగవచ్చని రాధాకృష్ణన్ విశ్వాసం వ్యక్తం చేశారు. మొత్తంగా.. కేరళ రాజకీయాల్లో కమ్యూనిస్టుల చరిత్రను 'హిందూ రాజకీయాల' కోణంలో చూడాలన్న రాధాకృష్ణన్ వ్యాఖ్యలు ఇప్పుడు కొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి.

# ఇలా జరుగుతుందని బాబు అండ్ కో కు ముందే తెలుసా?



అమరావతి,చంద్రబాబు ఫోటోలకు చేసిన అభిషేకాలనుంచి జాలువారిన పాలు ఇంకా తడి ఆరాయో లేదో.. అప్పుడే షాక్! స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు బీసీ వర్గాలు మురిసిపోయినంత సేపు కూడా వారి ఆనందం నిలువలేదు.బీసీ కులాలు అన్నింటినీ ఏకకాలంలో తాము ఉద్ధరించేస్తున్నట్టుగా భారీ ప్రచారం చేసుకుంటూ ఎన్డీయే ప్రభుత్వం తెచ్చిన జీవోలను హైకోర్టు కొట్టివేసింది. ఈ రిజర్వేషన్లు సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధం అని తేల్చిచెప్పింది.సర్ ప్రక్రియతో సంబంధం లేకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, ఆరువారాలకు మించకుండా ఈ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాలని హైకోర్టు ఆదేశించింది.తమాషా ఏంటంటే.. హైకోర్టు తమ జీవోలను కొట్టేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ముందే తెలుసా? అని విశ్లేషకులు భావిస్తున్నారు. హైకోర్టు తీర్పుపై రాష్ట్రప్రభుత్వం సుప్రీం కు వెళ్లనుంది. అయినప్పటికీ.. రిజర్వేషన్లు బీసీలను ఊరించిన రీతిలోనే అమల్లోకి వస్తాయనే నమ్మకం మాత్రం కలగడం లేదు.చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని ప్రజలు అనుమానించడానికి అనేక కారణాలున్నాయి. బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబునాయుడు సర్కారు జీవోలు తెచ్చింది మొదలు.. ప్రభుత్వంలోని పెద్దలందరూ ఈ విషయాన్ని విపరీతంగా ప్రచారం చేస్తూ వెళ్లారు.గతంలో జగన్ కూడా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించారు. అయితే సుప్రీం కోర్టులో ఆ రిజర్వేషన్ వీగిపోయింది. చంద్రబాబు తాను జీవో తేగానే.. అప్పట్లో జగన్ సుప్రీంకోర్టులో సరైనరీతిలో వాదనలు వినిపించకుండా జీవోలు రద్దు కావడానికి కారణమయ్యారంటూ నిరాధార ఆరోపణలు చేశారు.బీసీలను తాను మాత్రమే ఉద్ధరిస్తున్నానని ప్రచారం చేసుకున్నారు. దానికి తగ్గట్టుగానే ఆయన వందిమాగధ గణాలన్నీ కూడా అదే పని చేశాయి.టీడీపీ వర్గాలన్నీ.. బీసీలకు రిజర్వేషన్ కల్పించిన మహా నాయకుడు అంటూ విపరీతంగా ప్రచారం చేశాయి. కొత్తగా ఎంపీ పదవి దక్కించుకున్న చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో బీసీల ధన్యవాద సభను కూడా చాలా ఘనంగా నిర్వహించారు.ఇల్లలకగానే పండగ వచ్చినట్టుగా తెలుగుదేశం హడావుడి జరిగింది. బీసీలకు రిజర్వేషన్ అంశం విషయంలో.. స్థానిక ఎన్నికలు పూర్తయి.. 34శాతం బీసీలు పదవులు చేపట్టిన తర్వాత.. అప్పుడు ఘనంగా ధన్యవాద సభలు పెట్టుకుని ఉంటే బాగుండేది.కానీ.. ఇవి ఏ క్షణంలో రద్దయిపోతాయో అని భయపడుతున్నట్టుగా.. ఇలా జీవో రాగానే అలా పండుగలు చేసుకున్నారు. తీరా ఇప్పుడు హైకోర్టు కొట్టేసింది. చంద్రబాబు సుప్రీంకోర్టుకు వెళతాం అంటున్నారు.అసలు చంద్రబాబుకు స్థానిక ఎన్నికలు నిర్వహించే ఉద్దేశమే లేదని.. సుప్రీంలో కేసు పేరుతో అలా సాగదీస్తూ గడిపేస్తారని కూడా కొందరు వాదిస్తున్నారు.గతంలో సుప్రీంకోర్టు కొట్టేసిన వ్యవహారంలో జగన్ మీద నిందలు వేసిన చంద్రబాబు ఇప్పుడు ఏ రకంగా గొప్ప వాదనలు వినిపించి సుప్రీంలో కేసు నెగ్గేలా చేస్తారో చూడాలి. నెగ్గుతారో లేదా.. బీసీలను మభ్యపెట్టే ఇలాంటి డ్రామాలను మరొక రూపంలో కంటిన్యూ చేస్తారో గమనించాలి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140